

# అస్తిత్వానికి అటూ-ఇటూ...

మధురాంతకం నరేంద్ర

తన ముందున్న గుంపును రెండు చేతుల్తోనూ పక్కకు తొలగించుకుంటూ కంపార్టుమెంటు గేటు ముందుకెళ్లి, "సంజీవీ!.... సంజీవీ!" అంటూ మరోసారి అరిచాడు జానీ.

"జానీ... ఇక్కడ... నేనిక్కడ," అన్న సమాధానం వినవచ్చింది.

గేటులోంచి కిందికి దిగిన లావుపాటి ఆకారం వెనుక నుంచి ఓ చేత్తో సూట్‌కేసూ, మరోచేత్తో జిప్‌బాగూ పట్టుకొని సన్నగా, రివటలా వున్న శరీరం ప్లాట్‌ఫాంపైకి దూకింది.

"ఏదీ ఆ బాగ్ నాకియ్యి," అంటూ బలవంతంగా మిత్రుడి చేతిలోని బరువును అందుకోబోయాడు జానీ.

"అది వద్దు... యీ సూట్‌కేసు తీసుకో," అని కంగారుగా అరిచాడు సంజీవి జిప్‌బాగ్‌ను గుండెల కత్తుకుంటూ.

"ప్రయాణాలు చేసేటప్పుడు డబ్బును అండర్ పాకెట్ లో దాచుకోమని ఎన్నిసార్లు చెప్పాను నీకు! ఈ రష్‌లోఎవడైనా జిప్‌బాగ్‌ను లాక్కునిపోతే ఏం చేస్తావ్?" అంటూ దాన్ని లాక్కోబోయాడు జానీ.

"వద్దొద్దు..." అని ప్రాణమంతా వుగ్గపట్టుకొని అరిచాడు సంజీవి. జానీ విస్తుపోయి చూస్తూ వుండగా, "డబ్బు పాకెట్లోనే వుంది. నువ్వీ సూట్‌కేసు తీసుకో ముందు," అన్నాడతను తమాయించుకోవడానికి ప్రయత్నిస్తూ.

నలుపురంగు మఫ్లరూ, స్వెట్టర్లతో చీకట్లో కలిసి పోతున్న మిత్రుడి ఆకారంకేసి చికిలి చూపుల్ని సారించి, దేనికోసమో వెదుకుతున్నట్టు పైకీ కిందికీ కలయ జూశాడు జానీ. అంతలో తేరుకుని, మెల్లగా నవ్వేస్తూ, "ఈ అర్థరాత్రి ప్రయాణాలు అలవాటులేక ఎక్కడో పడి నిద్రపోయినావనుకుంటిని. బోగీలోకెక్కి సీటు కనిపెట్టి, బయటికి మోసుకొని రావల్సిందేనేమోననిపించింది," అన్నాడు.

ప్లాట్‌ఫాంపైన నడుస్తున్న జనాలకు దారివ్వడం కోసం దూరంగా వచ్చి నిల్చున్నాక, "నిద్రనేది పోతేగదా మేల్కొనే దానికి! బెర్తులు వాల్చుకున్నామన్న మాటేగానీ పాసింజెర్లు నిద్రేపోలేదు. పన్నెండుగంటల నుంచీ అలహాబాదొచ్చేసిందొచ్చేసిందని ఆపసోపాలు పడతానే వున్నారు," అన్నాడు సంజీవి.

"సరే, అయితే త్వరగా బయటపడ్దాం పద! ఇప్పుడు గంట మూడు కావస్తా వుంది. రూం చేరుకుంటే గంటైనా కునుకు తీయచ్చు," అంటూ అతగాణ్ణి ముందుకు లాగాడు జానీ.

స్నేహితుడి చేతిని పక్కకు తొలిగిస్తూ "వుండుండు. మనమిప్పుడు మీ రూంకు పోవడం లేదు. నాకోసం మనిషిని స్టేషనుకే పంపిస్తానన్నాడాయన," అన్నాడు సంజీవి. 'ఎవరు? ఎవరిని?' అన్న ప్రశ్నలు జానీ పెదవుల మధ్య నుంచీ దొర్లక మునుపే వెనక్కు తిరిగి, "ఆపక్కన ఎవురో అరుస్తా వుండారు చూడు," అన్నాడతను. జానీ వెనుదిరిగి చూశాడు.

ఒకటి రెండు నిముషాల తర్వాత, "లక్ష్మీ నారాయణశాస్త్రి," అన్నమాట వినిపించింది. మరో రెండు నిముషాల తర్వాత మరింత దగ్గరగా అదే మాట వినవచ్చింది. ఇంకో రెండు నిముషాల తర్వాత ఆ మాటను ప్రసారం చేస్తున్న వ్యక్తి సైతం వాళ్ల ముందుకు వచ్చేశాడు.

దాదాపు ఆరడుగుల పొడవున్న బలిష్టమైన ఆ వ్యక్తి వయస్సు చీకటిలో స్పష్టంగా గోచరించడం లేదు. పొడవాటి లాల్చీ కింద గోచీపోసి కట్టుకున్న పంచె. బాగా పొట్టిగా కత్తిరించుకున్న తల వెంట్రుకల మధ్య పొడ వాటి పిలక. చేతిలో గొడుగు. పహిల్వాన్‌లా కనిపిస్తున్న ఆ వ్యక్తి ముందుకు గెంతుతూ "నేనే! నేనేనండీ లక్ష్మీనారాయణశాస్త్రిగారి గెస్టును," అన్నాడు సంజీవి.

అతను తన నడక వేగాన్నయినా తగ్గించకుండా, గొడుగును ముందుకు చాపుతూ, "దేఖియే! వుస్ ఖంబాకే పాస్ ఖడేహోజాయియే! సబ్‌లోగ్ వహీ యింతె జార్ కర్ రహేహై!" అంటూ ముందుకు కదిలి పోయాడు.

జానీ ముఖం ముడుచుకుని సంజీవి వెంట నడుస్తూ, "ఈ లక్ష్మీనారాయణశాస్త్రి ఎవరు?" అని అడిగాడు.

"మా కొలీగ్‌కు తెలిసిన మనిషి. ఇక్కడే అలహా బాదులో వుంటాడు. నేనొస్తా వున్నట్టుగా ముందుగా జాబు రాసినాను. ఆయన నేరుగా ఫోన్ జేసినాడు. వాళ్ల ఇంటికే వచ్చేయమన్నాడు. పన్లన్నీ ఆయనే దగ్గిరుండి జరిపిస్తానన్నాడు," అన్నాడు సంజీవి.

జట్లుజట్లుగా నిలబడ్డ జనాల్ని దాటుకుంటూ ఓ గుంపు దగ్గరికొచ్చాక "లక్ష్మీనారాయణశాస్త్రి... లక్ష్మీ నారాయణశాస్త్రి," అంటూ తన కోడ్ సందేశాన్ని వినిపించాడు సంజీవి. వాళ్లు పట్టించుకోకుండా అతడికి అర్థంగాని వేరే భాషలో మాట్లాడుకోసాగారు. "ఆ పెద్ద మనిషి చెప్పిన తావు ఇదిగాదేమో!" అని గొణుక్కుంటూ మరో గుంపు దగ్గరికి వెళ్లి, మరోసారి తన కోడ్‌ను పలికా డతను. "మేమూ అక్కడికే! లక్ష్మీనారాయణశాస్త్రి... అక్కడికే! అక్కడికే," అంటూ కొన్ని గొంతుకలు వంత పలికాయి. మరికొంచెం పక్కకు జరిగి, ఆ గుంపులో కలిసిపోయే ప్రయత్నం చేశాడు సంజీవి. తానూ వచ్చి అతడి పక్కన నిల్చుంటూ వాళ్లనందరినీ పరీక్షించి చూడసాగాడు జానీ. మూటలూ, మనుషులూ, చీకటీ, మసక వెలుతురూ కలగలిసిన ఆ సమూహంలో ఎవ రెవరు ఏమిటో తెలుసుకోవడానికి విశ్వప్రయత్నం చేయ సాగాడు. ఈలోగా గొడుగు పట్టు కున్న హిందీ మనిషి ఆ గుంపు ముందే పెద్ద పెద్ద అంగలు సారిస్తూ మరో వైపుకు దూసుకెళ్లాడు. గుంపు గుంపంతా వొకే గొంతులా "ఇక్కడ... ఇక్కడ... మేమిక్కడ," అంటూ హోరెత్తింది. అతనూ అదే జోరుతో "వహీ రహియే," అని అరుస్తూ వెళ్లిపోయాడు. ఈలోగా మరికొన్ని నీడలు ఆ గుంపులో కలిశాయి.

"ఇంతమంది అతిథులూ వొక యింటికేనా?" అంటూ ఆశ్చర్యపోయాడు జానీ. ఈలోగా సమూహం లోని వ్యక్తులు కొందరు పరస్పర పరిచయాలు మొదలుపెట్టారు. తిరుపతి, గుంటూరు, వరంగల్లు, కాకినాడ, ఆదోని, అనంతపురం... వివిధ ప్రాంతాలకు చెందిన వూరి పేర్లు వినబడుతున్నాయి.

మరి కాస్సేపటి తర్వాత గొడుగు పహిల్వాను తిరిగొచ్చాడు. "సబ్ టేషన్‌కే బాహర్ చలియే! వహాసే ఆటోమే జానా హై" అంటూ ఫర్మానా దాఖలు చేశాడు. అతడి వెనుకే గుంపంతా కదిలింది. సంజీవితోబాటూ జానీ కూడా నడవసాగాడు.

యెక్కువమంది ప్రయాణీకుల్ని అలహాబాదు లోనే విడిచేసిన వారణాసి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం పక్కన ఇంకా నసుగుసులు పడుతోంది. పక్కనే చాయ్ వాలాలు సుప్రభాతం పలుకుతున్నారు. ఓవర్‌బ్రిడ్జి పైన్నుంచీ చూస్తున్న జానీకి, తెలుపూ, యెరుపూ, ఆకు పచ్చ దీపాలతో జోగుతున్న రైల్వేస్టేషను, పగటి వేషగాడి చమ్కీదుస్తుల్లా వెలవెలబోతూ కనిపిస్తోంది. తెలుగు భాషనే మాధ్యమాన్ని వూతగా పట్టుకుంటూ లక్ష్మీ నారాయణశాస్త్రిగారి అతిథులందరూ స్టేషను బయటకు తరలి వచ్చేశారు. మంచులో తడిసిన చిత్తడి నేలపైన పెద్ద పెద్ద ఆటోలూ, గుర్రపుబండ్లూ అడ్డదిడ్డం గా వేచి వున్నాయి. గొడుగు పహిల్వాను అస్పష్టమైన గొంతుకతో ప్రయాణీకులకేవో సలహాలు చెబుతు న్నాడు. జట్లుజట్లుగా వాళ్లు పెద్ద సైజు ఆటోల్లోకి బదిలీ అవుతున్నారు.

ఆటో చిన్నసైజు వానులాగుంది. మూడు వరుసల సీట్లు. సీటు కారుగురు మనుషులు. వాహన మంతా స్ప్రింగుల సంచయంలా వూగుతుండగా బడ బడమని శబ్దం చేస్తూ ఆటో బయల్దేరింది. "విక్రమ్ అంటార్లే ఈ ఆటోను ఈ వూళ్లో!" అంటూ సంజీవికి దాన్ని పరిచయం చేశాడు జానీ.

నిద్రపోతున్న రోడ్లవెంట విక్రమ్ పరుగులు తీయ సాగింది. ముందుగా వెళ్తున్న ఆటోల తాలూకు యెర్రటి లైట్లు మంచుతెరల మధ్య మినుకు మినుకుమంటు న్నాయి. రోడ్లకిరువైపులా ముసుగులు కప్పుకున్న వ్యక్తుల్లా ఇండ్లు గూడా నిద్రలో కునుకుతున్నాయి. విశాలమైన వీధుల్ని దాటి, సన్నటి సందుల్లోకి దూరింది విక్రమ్. నేలపైన ఇటుకలు పరిచిన సన్నటి గొందులు, రెండువైపులా పెచ్చులూడిన పాతకాలపు ఇండ్లు, బాగా పల్లంగా కనిపిస్తున్న దారి... వీధిదీపాలు వెలగడంలేదు. ఎక్కడికి వెళ్తున్నామో అంతుపట్టని అగమ్యగోచరమైన

దారి. చివరికి ఇద్దరు వ్యక్తులు మాత్రం నడవడానికి వీలయ్యే సన్నటి గొంది ముందు వరుసగా విక్రమ్‌లు ఆగిపోయాయి. అంతటితో తమ పని అయిపోయినట్లు గా విక్రమ్ డ్రైవర్లు దిగి వెళ్లిపోయారు.

"ఎక్కడికి పోతావుండాం మనం? యిక్కడేం పని మనకు?" అంటూ ప్రశ్నించాడు జానీ ఆందోళనతో నిండిన గొంతుకతో. అతడి మాటల్ని పట్టించుకోకుండా, "మనమూ పోదాం రా," అంటూ తోటి ప్రయాణీకుల్ని అనుసరించసాగాడు సంజీవి.

ఏటవాలుగా, పెద్ద అగడ్తలోకి లాక్కెళ్తున్నట్టున్న సన్నటి వీధి. రెండువైపులా పాడుబడిన పాత యిండ్లు.... యెక్కడా దీపాలు వెలగడం లేదు. అయిదు నిముషా లలా గడిచిన తర్వాత ఓ మలుపులో చిన్న గుడ్డి విద్యు ద్దీపం కనిపించింది. దాని ముందు ప్రయాణీకుల సంరంభమూ వినిపించింది. ముందుగా గుడ్డిదీపం కింద, పాతకాలపు గార మిద్దెపైన రంగులు వెలిసి పోయిన చెక్క తలుపుల పక్కన, బాగా నొక్కులు పడిన రేకు పైన, వంకరటింకరగా, తప్పుల తడకగా వున్న తెలుగు అక్షరాలు జానీ దృష్టిని ఆకర్షించాయి. 'ప్రనామం హయిగ్రీవశాస్త్రుల ధర్మసత్రము... క్షీరోద్రము లక్ష్మీనారాయణశాస్త్రులు, ఆంధ్రపండా.... తీర్థ పురోహితులు.'

పొట్టిగా వున్న పాతకాలపు ద్వారంగుండా, సంజీవి వెంట యింటి లోపలికి అడుగు పెట్టాడు జానీ. అది చేయెత్తితే తగిలేటట్టున్న చిన్న గది. మూడువైపులా ద్వారాలున్నాయి. ఓ ద్వారంగుండా ముందుకెళ్లారిద్దరూ. సన్నగా పొడవాటి సొరంగంలాంటి మార్గం. మరో గది తర్వాత మరో సన్నటి దారి. మరో పాతబడిన గుమ్మం దాటగానే పెద్ద నడవా. మధ్యలో ఆకాశం కనిపిస్తోంది. దాదాపు యిరవై అడుగుల పొడవూ, వెడల్పులతో పెద్ద వసారా. చుట్టూ రకరకాల గదులు. పెచ్చులూడిపోయిన వసారా, గార నేలపైన రకరకాల చెత్తాచెదారం... మురికి నీళ్ల వెల్లువలు... నడవా అరుగుపైన కూర్చున్న గొడుగు పహిల్వాను పెద్దపెద్ద తాళాలగుత్తి చేతబట్టుకుని, చుట్టూ మూగిన జనాల్ని గదమాయిస్తున్నాడు. "మాకో గది... మాకూ వొకరూం... మా రూమేదయ్యా?" అంటూ గొంతుకలు అతడ్ని ప్రాధేయపడుతున్నాయి.

జిప్‌బాగ్‌తో సహా గుంపులోనికి జొరబడి, అతి ప్రయత్నం మీద అతగాడిని సమీపించాక, "లక్ష్మీ నారాయణశాస్త్రిగారెక్కడ?" అని అరిచాడు సంజీవి.

అతను సంజీవివైపుకు తిరిగైనా చూడకుండా, "వే సొరహే హై! కల్ మిలేంగే!" అన్నాడు.

"అయితే నాకు కూడా ఒక రూం ఇయ్యండి. నాకు అన్ని సౌకర్యాలు అమిరిస్తానని శాస్త్రిగారే ఫోన్ చేసి రమ్మన్నారు," అన్నాడు సంజీవి విసుగ్గా.

"తుమ్హారా నామ్?" అతను వాకబు చేశాడు.

"సంజీవి ఫ్రమ్ మదనపల్లె... చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్..." అంటూ మళ్లీ గొంతు చించుకున్నాడు సంజీవి.

"క్యోం షోర్ మచా రహేహో! యే తాళాలేలో కమరా నెమ్మర్ బత్తీస్ మే జావో," అని కసురుకుంటూ అతడి చేతికో తాళం అందించాడు గొడుగు పహిల్వాను.

తాళంచెవిని చేత బట్టుకుని తమ గదికోసం వెదకసాగారు స్నేహితులిద్దరూ. సొరంగాల్లాంటి దారుల్ని కలుపుతున్న నడవాల మధ్య కావల్సిన గదిని కని పెట్టడమంత సులభసాధ్యంగా తోచడంలేదు. వాకబు చేసి తెలుసుకోవడానికి యాత్రికులుగాని వ్యక్తులెవరూ ఎదురుపడడం లేదు. చివరికో మూల రూం నెంబరు ముప్ఫయిరెండును కనిపెట్టాడు జానీ. నామమాత్రంగా వేలాడుతున్న బీగం తెరిచి గది లోపలికి అడుగుపెట్టారు ఇద్దరూ. విరిగిపోయిన స్విచ్‌బోర్డును చీకట్లో వెదికిపట్టి స్విచ్ నొక్కేసరికి జానీ తలప్రాణం తోకకొచ్చింది. గుడ్డి దీపం వెలిగింది. అలమారాలూ, మంచాలూ లేని నిర లంకారమైన గది. ఓ మూల చెదలు పట్టిన ద్వారం. అవతల బాత్రూం వుండొచ్చు. తలుపును వోరవాకిలిగా వేశాక, జిప్‌బాగ్‌లోంచి పాత శాలువాను పైకిలాగాడు సంజీవి. దానితోనే నేలపైని చెత్తను ఓ మూలకు చిమ్మి, ఆ తరువాత దాన్ని నేలపైన పరిచేశాడు.

శాలువా పైన చేరగిలబడుతూ, "ఇదేనా నీ కోసం ఆయనగారు ఏర్పాటుచేసిన అతిథి సత్కారం?" అంటూ చిరునవ్వు నవ్వాడు జానీ.

తాను గూడా నడుం చేరేస్తూ, "అలహాబాదుకు అస్థికల నిమజ్జనం కోసం పోవాలని చెప్పినప్పుడు మా కొలీగ్ ఒకాయన ఈ అడ్రస్సు నాకిచ్చి జాబు రాయ మన్నాడు. జాబుకు బదులుగా టెలిఫోన్ వచ్చింది. పగటిపూట అంత ఖర్చు భరించుకొని ఫోన్ చేసి రమ్మని పిలిచినాడు ఆయన. తీరా వచ్చినాక ఇప్పుడు యింత వరకూ మన అతీగతీ పట్టించుకోలేదు," అన్నాడు సంజీవి.

"నువ్వు గమనించినావో లేదో! ఇక్కడికొచ్చినో ళ్లంతా నీ మాదిరి అస్థి నిమజ్జనానికొచ్చినోళ్లే! అందరికీ ఫోన్లూ, జాబులూ అందినాయి. చూడబోతే యిదే ఆయన వృత్తిగా వుండాది," అన్నాడు జానీ.

"అయితే మంచిదే! తెల్లారిపోతా వుంది. ఈ పొద్దు పౌర్ణమి. మధ్యాహ్నం పన్నెండు గంటల్లోపల

నిమజ్జనం జరిపించాలని ఫోన్లో హెచ్చరించినాను...'' కళ్లు మూసుకునే చెబుతున్నాడు సంజీవి.

''ఆర్నెల్లకు ముందు, నేను అలహాబాదుకొచ్చే దానికి ముందు, మీ ఇంటికొచ్చినప్పుడు బాగానే కనిపించింది గదా మీ అమ్మ! యింతలోపల అంత ఖాయిలా యెట్ల పడింది?'' చాలాసేపటి నుంచీ అడగదలచుకుంటున్న ప్రశ్నను చివరికి సంధించాడు జానీ.

''ఆ పొద్దు తెల్లారి నేను ఆఫీసుకు బయల్దేరతా వున్నప్పుడు గుండెల్లో నొప్పిగా వుందని చెప్పింది,'' సంజీవి గొంతుక బొంగురుపోసాగింది. పడుకున్నందువల్ల అతడి కనుకొలుకుల్లో కొచ్చిన కన్నీటిబొట్లు రెండూ అలాగే అక్కడే నిలిచిపోయాయి. ''ఆ మాదిరి అప్పుడప్పుడూ అనడం ఆమెకు అలవాటే! ఆ పొద్దుగూడా అంతేలే అనుకున్నాను. పన్నెండు గంటలప్పుడు పక్కింటి పిల్లోడు పరిగెత్తుకొనొచ్చి అమ్మ పడిపోయిందని చెప్పినాడు. గబగబా యింటికి పోయి, వెమ్మట్నే ఆస్పత్రికి తీసుకొనిపోయినాను. యింటెన్సివ్ వార్డులో చేర్పించినారు. వారందినాలు కోమాలో వుండిపోయింది. అప్పటికే ముప్ఫయివేలు ఖర్చయింది. అర్జెంటుగా యాభై వేలు అడ్వాన్సుగా కడ్తే ఆపరేషను చేస్తామన్నారు. డబ్బుకోసం వెతుకులాడతా వుండిపోయినాను యింకో వారందినాలు. ఈలోపల అంతా అయిపోయింది.''

''టయానికి దుడ్డెందుకు కట్టలేదు? పోనీ తర్వాత డబ్బు అడ్వాన్సు గడ్తానని చెప్పి ఆపరేషనయినా చెయ్యించలేకపోయినావా? డాక్టర్లు గూడా డబ్బుకోసమని పేషంటును నిర్లక్ష్యం చేస్తారా? వీళ్లేం మనుషులు?'' కోపంతో ఆక్రోశించాడు జానీ.

సంజీవి బదులు పలకలేదు.

''పోనీ నాకైనా టెలిగ్రామిచ్చుంటే యేమి? నేనెక్కడైనా ప్రయత్నం చేసుందును గదా?''

''మన ప్రాప్తం తీరిపోయింది. మనుషుల ప్రయత్నాల్తోనే అన్నీ జరిగేటట్టుంటే యింక మనుషుల్ని పట్టలేం. కర్మ చేసేదే మన పని. ఫలితం మాత్రం మన చేతిలో లేదు'' అన్నాడు సంజీవి.

''నీ వేదాంతాన్నీ, భక్తినీ గంగలో కలిపెయ్. ఇట్లాంటప్పుడు అవేవీ నిన్ను కాపాడవు. నీకైనా, నాకైనా, ఆ డాక్టరుకైనా దుడ్డొక్కటే దిక్కు. నాకు టెలిగ్రామిస్తే నా అగసాట్లేవో నేను పడుందును,'' జానీ మండిపడ్డాడు.

''ఎంతని అడగమంటావు?'' సంజీవి మాత్రం నెమ్మదిగా చెప్పుకుపోతున్నాడు. ''ఇప్పటికే నీకియ్యాల్సిన అప్పు వడ్డీతో కలిసి పాపం మాదిరిగా పెరిగిపోయింది. ఇచ్చేదానికి నీకు అభ్యంతరం లేకపోయినా, అడిగేందుకు నాకైనా నోరుండాలగదా?''

ఇద్దరూ మౌనంగా వుండిపోయారు. కాస్సేపటి తర్వాత సంజీవి గురకపెట్టడం గమనించాడు జానీ. బయటినుంచీ మానవ సంరంభం స్పష్టంగా వినబడుతోంది. అతడి చేతి గడియారంలో సమయం అయిదు గంటల్ని దాటింది. యిక ఆ రోజుకు నిద్రపోయే అవకాశం తనకు లేదని జానీ కర్థమయింది.

తలుపు తెరిచిన శబ్దం వినబడగానే తిరిగి చూశాడు జానీ. పావడ పైన పొడవాటి జాకెట్టు తొడుక్కున్న పన్నెండు పద్మూడేళ్ల అమ్మాయి లోపలికొచ్చింది. ''ఉదయానికి మీకు టిఫెను తయారుచెయ్యాలంటే ముందుగా ఆర్డరివ్వాలి,'' అంది.

''ఏం టిఫెను?'' అని అడిగాడు జానీ.

''ప్లేటు ఇడ్లీ పది రూపాయలు. దోసె పదిహేను. వుప్మా పది. కాఫీ అయిదు. టీ నాలుగు. కావాలంటే రూంకు తీసుకొస్తాను. లేకపోతే అక్కడికైనా వచ్చి తినచ్చు.''

''ఎక్కడికి?''

''ఇక్కడే! ఆ తూర్పువైపు వసారా దగ్గరే మా గది.''

కాస్సేపు ఆలోచించాక, ''ఇంత బాగా తెలుగు మాట్లాడతా వుండావు. మీది ఏ వూరు?'' అని ప్రశ్నించాడు జానీ.

''నా పేరు సత్యవతి. మా వూరు తెనాలి''.

''ఇక్కడికెప్పుడొచ్చినావు?''

''మా అమ్మానాన్నా యీ వూరొచ్చి నాలుగేళ్లవతాంది. నేనేమో రెండేళ్ల క్రితం వచ్చాను.''

''ఇక్కడే చదువుకుంటా వుండావా?''

''లేదు... ఇక్కడ సప్లయి చేయటానికి మనిషి కావల్సివచ్చి మావాళ్లు నన్ను రప్పించుకున్నారు. ఆర్డరు చెప్తారా?''

''లక్ష్మీనారాయణశాస్త్రి ఎక్కడుంటాడు?''

''ఇక్కడే! మూడో అంతస్థులో వుంటారాయన. పొద్దున్న ఆరింటికల్లా కచేరీ కొస్తారు. ఆసరికి మీరు స్నానంచేసి రెడీగా వుంటే సంగమానికెళ్లొచ్చు. నిమజ్జనం చేసేవాళ్లు మాత్రం ఉపవాసం వుండాలి. మిగతా వాళ్లు టిఫిన్ తినచ్చు.''

''శాస్త్రిది ఈ వూరేనా?''

''ఆయనది కూడా తెనాలే! ముందున్న ఆంధ్రా పండాకు పిల్లలు లేకపోతే వీరిని దత్తుకు తెచ్చుకున్నారట.''

''ఈయనకు బిడ్డలెందరు?''

"నలుగురు. ఇద్దరమ్మాయిలు, ఇద్దరబ్బాయిలు. ఆర్డరు చెప్పండి. వెళ్లాలి...."

"చెప్తాన్లే వుండు! ఈయన కొడుకులేంచేస్తారు?"

"కొడుకులూ, అల్లుళ్లూ, అందరూ ఇక్కడే వున్నారు. అందరూ ఆయన లైన్లోనే పనిచేస్తున్నారు. క్షణం తీరికుండదాయనకు. ఆర్డరు చెప్పండి..."

"రెండు ప్లేట్లు ఇడ్లీ... రెండు కాఫీలు."

ఆ అమ్మాయి మరోమాటకు అవకాశమివ్వ కుండా వెనుదిరిగి వెళ్లిపోయింది.

"సంజీవీ! పైకి లేచి స్నానం చెయ్యి. ఆరుగంటల కంతా నీ పని ఆరంభమయితిందంట!" అంటూ స్నేహితుణ్ణి లేపి కూచోబెట్టాడు జానీ.

"పొయ్యేది గంగ దగ్గరికేగదా! ఆడ్నే స్నానం చేస్తాను," అన్నాడు సంజీవి బద్ధకంగా.

"ఇక్కడ టాప్‌లో వస్తావుండేది గూడా ఆ నీళ్లే! ముందిక్కడ స్నానం చెయ్యి! ఆపైన అక్కడా జేద్దువు గానీ," అంటూ అతడ్ని బాత్‌రూంలోకి నెట్టాడు జానీ.

"మరి నీ స్నానం?" అని అడిగాడు సంజీవి స్నానం చేశాక బట్టలు మార్చుకుంటూ.

"ఈ చన్నీళ్లు పోసుకుంటే నాకు జరమొస్తింది. ఈ పొద్దుకు స్నానం పోస్ట్‌పోన్..." అన్నాడు జానీ. అతడు ముఖం కడుక్కునేసరికి, టిఫిన్ ప్లేట్లతో సత్యవతి గదిలోకొచ్చింది.

"నేను ఒక పొద్దుండాలని చెప్పినారు. నువ్వు తిను," అన్నాడు సంజీవి.

"మీరు కాఫీమాత్రం తాగొచ్చు," అంది సత్యవతి.

"చూసినావా! అదీ అమెండ్‌మెంట్. అందుకే ఇవేవీ లెక్కపెట్టద్దన్నాను," అంటూ విసుక్కున్నాడు జానీ.

"ఆర్డరిచ్చాక టిఫిన్‌కంతా డబ్బులివ్వకుంటే ఒప్పు కోరు. మొత్తం ముప్ఫయ్యా ఇవ్వాలి మీరు!" అంది సత్యవతి.

"ఇదేం రూలు. తినకుండా డబ్బులెందు కియ్యాల? అంతగా అయితే ఆ ప్లేటు కూడా ఇట్లియ్యి. రెండూ నేనే తింటాను," అంటూ కోపగించుకున్నాడు జానీ.

టిఫిన్ ప్లేట్లు కిందపెట్టిన తరువాత, "నిమజ్జనా నికి వెళ్లేవాళ్లు ధోవతీ, టవలూ మరిచిపోకుండా పట్టుకెళ్లాలి," అంది సత్యవతి వెనుదిరిగి వెళ్లిపోతూ.

టిఫిన్ తిన్న తర్వాత, "అరయిపోయింది. పద కచేరీకి. మీ లక్ష్మీనారాయణశాస్త్రిని కలుద్దాం," అన్నాడు జానీ.

జిప్‌బాగ్‌ను భుజానికి తగిలించుకుని సంజీవి బయల్దేరాడు.

గదికి తాళం వేసి వసారాలోకొచ్చిన తర్వాత తల పైకెత్తి చూశాడు జానీ. రెండవ అంతస్థు గూడా కింది భాగంలాగే నానా కంగాళీగా వుంది. మూడవ అంతస్థు మాత్రం మెరుస్తున్న రంగులతో, బయటికే కనిపిస్తున్న ఏసీ మిషన్లతో జబర్దస్తీగా వెలుగుతోంది. "అదే మీ శాస్త్రి నివాసం," అంటూ చూపెట్టాడు జానీ.

రెండడుగుల ఎత్తున్న సిమెంట్ వేదిక పైన, రాత బల్ల కవతల, తెల్లటి పరుపుపైన కూర్చుని వున్నాడో వ్యక్తి. మూటలా ఒదిగి కూచోవడంవల్ల అతడెంత పొడ వున్నాడో తెలియడంలేదు. దూదికుచ్చులా తెల్లబడి పోయిన అతడి జుట్టు బయటికి కనిపించని శారీరక రుగ్మతని బయటపెడ్తోందిగానీ, అతడి వయస్సెంతో తెలపడంలేదు. అతడి వెనుక గోడకు వేలాడుతున్న ఫోటో ఏటవాలుగా వుండడంచేత అందులోని చిత్రమె వరిదో తెలియడంలేదు. దస్తావేజు పుస్తకమొకటీ, బిల్లు పుస్తకమొకటీ ముందుంచుకుని అతనేదో రాసుకు పోతున్నాడు. చుట్టూ గుమిగూడిన జనం ఒకేసారిగా అతడితో మాట్లాడడం కోసం ఆరాటపడుతున్నారు.

"నిమజ్జనానికి రెండువందలా యాభై, వేణీ దానానికి అయిదువందలు, గోదానానికి వెయ్యిన్నీ నూటపదహార్లు. అవి మినిమమ్ రేట్లు. ఆపైన ఎంత మనస్సుకు తృప్తో అంత ఇవ్వచ్చు. చనిపోయినవాళ్ల ఆత్మకు శాంతి జరగాలి. వాళ్ల పరలోక యాత్ర నిర్విఘ్నం గా సాగాలి. అందుకు మీరెంతయినా చెల్లించవచ్చు."

రాతబల్ల ముందున్న వ్యక్తి కీచు గొంతుక పదేపదే యిదే మాటల్ని వల్లిస్తోంది. ఫీజు చెల్లించిన వాళ్లు రసీదు కాగితాలతోబాటూ వెలుపలికొచ్చి సంగమానికి ప్రయాణమౌతున్నారు.

ఇంతలో చివ్వున బిల్లు పుస్తకం మూసిపెడుతూ, "మిమ్మల్ని కాస్సేపు అవతల కూచోమన్నానుగదా!" అంటూ కోపంగా అరిచాడతను. గుంపుగా అతడ్ని చుట్టుముట్టిన జనమంతా ఎవరికివారు కంగారు పడిపోతూ వెనక్కు తప్పుకున్నారు.

ఒక వ్యక్తిమాత్రం జోడించిన చేతుల్ని కిందికి దించకుండా, "శాస్త్రిగారూ! జేబులోని సొమ్మునంతా ఎవరో రైల్లో కాజేశారు. యిప్పుడు నా దగ్గర పైసాగూడా లేదు. నిమజ్జనం మీరే ఏదోలా జరిపించాలి. ఇంటికి తిరిగివెళ్తూనే వడ్డీతోబాటూ టీఎమ్ఓ చేస్తాను," అంటూ ప్రాధేయపడసాగాడు.

"ఆలోచిద్దాం. ముందు అవతలికెళ్లండి. డబ్బుల్తో బాటూ నిల్చున్నవాళ్లకు రశీదులివ్వనివ్వండి," అని గింజుకున్నాడు శాస్త్రి.

"శాస్త్రులుగారూ! పుణ్యమంతా మీదే! ఈ పని జరిపించండి," అతను పట్టినపట్టు వదలలేదు.

"నా పుణ్యం సంగతి సరేలేవయ్యా! మరి మీ పెద్దలు పుణ్యలోకాల కెళ్లాలావద్దా? నా దక్షిణ సంగతి సరేననుకో! అవతల మిగిలినవాళ్లకివ్వవలసిన సొమ్ము సంగతేం చేస్తావు?"

"ఇది గాకుండా యింకానా? అదెంత ఖర్చవుతుంది?"

"ఎంత లేదన్నా యింకో రెండువందలు..."

"శాస్త్రిగారూ!" గుంపులోనుంచి ఎవరో అరిచారు.

"ఆ మిగిలిన సొమ్ము మేం ఏర్పాటుచేస్తాం. ఇంటికెళ్లాక పంపుతానంటున్నాడు గదా! మీరే సహాయం చేయకపోతే ఈ వూళ్లో దిక్కింకెవరున్నారు వీరికి! మీ వంతుగా రశీదు ఇప్పించండి."

శాస్త్రి ఓసారి పెద్దగా నిట్టూర్చాడు. "ఇంటి కెళ్తూనే డబ్బు పంపించు. లేకపోతే మీవాళ్లకు పంచపాతకాలూ చుట్టుకుంటాయి. ఆపైన నీ ఇష్టం," అంటూ హెచ్చరించాక ఓ తెల్ల కాగితం ముక్కని అతడి చేతికిచ్చాడు.

సంజీవి ఈసారి బలప్రదర్శనలో పాలు పంచుకుంటూ ముందుకు తోసుకెళ్లాడు. "శాస్త్రిగారూ! నేను సంజీవిని. మాది మదనపల్లె. మీరు ఫోన్ చేసి రమ్మన్నారు," అని పెద్దగా అరిచాడు.

శాస్త్రి అతడివైపుకు తిరిగైనా చూడకుండా, "చెప్పండి! నిమజ్జనమా? వేణీదానమా? గోదానం కూడా వుందా?" అంటూ రేట్ల జాబితా చదివాడు. సంజీవి రెండువందల యాభై యిచ్చి రశీదు తీసుకున్నాడు.

"పద పద... విక్రమ్‌లు ఎదురుచూస్తూ వుండాయి మనకోసం," అన్నాడు జానీ.

ఇంటి బయటికొచ్చి కొద్దిదూరం నడిచాక ఓసారి వెనుదిరిగి చూశాడు జానీ. పాతబడిన గారమిద్దెల మధ్య కూలిపోవడానికి సిద్ధంగా వున్నట్టున్న రెండు కింది అంతస్థులపైన, అధునాతనంగా, దర్జాగా, డాబుగా, తళతళలాడుతూ కనిపిస్తోంది శాస్త్రి నివాసం.

"చూడు! మీ శాస్త్రి అంగడి ఎంత బాగా జరగతా వుందో!" అన్నాడు జానీ. "నిజానికది స్వంత ఇల్లు కూడా కాదు. ఎవరో కట్టించిన పాత సత్రం. కిందంతా అస్థి నిమజ్జనాల కోసం వచ్చే జనాల బస. ప్రతి రూమ్‌లోనూ, ప్రతి మనిషి చేతుల్లోనూ అస్థికల మూట. పైన మాత్రం ఒట్టి కోలాహలం. హైస్కూల్లో మన టీచరు 'సమాధుల మధ్యలో జయకేతనాలు,' అని చెప్తూ వుండేవాడు. ఆ మాట జ్ఞాపకమొస్తా వుంది నాకు."

ఇద్దరూ ఇటుకరాళ్లు పరిచిన సన్నటి రోడ్డుపైన నడుస్తూ ముందుకు వస్తున్నారు. రెండువైపులా పాగ చూరి కూలిపోవడానికి సిద్ధంగా వున్న ఇండ్లు, వంటిల్లూ, బాత్రూం, పడక గదీ అన్నీ అదే అయిన చిన్నచిన్న కాపురాలు. సైడు కాలవలే పిల్లలకూ, పెద్దలకూ కక్కసులై పోయినట్టు తెలిసిపోతోంది. వీధిలోనే పెద్ద ప్లాస్టిక్ బకెట్ పెట్టుకొని నడివయసు స్త్రీ ఏకంగా స్నానం చేస్తోంది. ఎటు చూసినా మురికి, దారిద్ర్యం.

ఆగిన విక్రమ్‌లో కూర్చోగానే, "హర్ ఆద్మీకో సత్తర్ రూపాయా బాడా! రాత్‌మే యహా ఆనేకా బీస్ రూపయా! అబ్ సంగమ్‌కో అనే జానే కేలియే పచాస్ రుపియా," అన్నాడు డ్రైవర్.

"పాపం ఇచ్చేవానిదా, తీసుకునేవానిదా అనేది గదా ప్రశ్న!" అని నవ్వేశాడు జానీ.

సీట్లన్నీ నిండాక విక్రమ్ వెనక్కు తిరిగి పరుగులు తీయసాగింది. సన్నటి గతుకుల రోడ్డు దాటి, కాస్త పెద్దదైన తారురోడ్డు మీది కొచ్చి, రకరకాల సెంటర్లను అధిగమించి, మళ్లీ సన్నటి రోడ్లను ఆశ్రయించి, దాదాపు అరగంట సేపటి తర్వాత, వాలుగా వున్న రోడ్డుపైన పరిగెడుతూ, చివరికి గంగాయమునల సంగమస్థలాన్ని యాత్రికుల దృక్కోణంలో నిలిపింది విక్రమ్.

*

...వచ్చి అటువైపు నుంచీ తెల్లటి ప్రవాహమూ, ఇటువైపు నుంచి నల్లటి ప్రవాహమూ రెండూ కలిశాక లేత నలుపురంగు ప్రవాహమై, కనిపించని మరో ప్రవాహాన్నీ తనలో కలుపుకుంటోందన్న విషయం భ్రమో, నిజమో, ఇతరులకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతూ, ఒడ్లను వొరుస్తూ, గట్లను తడుపుతూ, క్షణక్షణానికీ మారుతూ, మార్పన్నదే లేదన్నట్లుగా గలగలా రవళిస్తూ, భూమ్యాకాశాల్ని కలుపుతున్నట్టుగా దిగంత రేఖదాకా సాగుతూ, దిగంత రేఖను మరికాస్త ముందుకు నెట్టుకుంటూ కదులుతూ, అనాదిగా, అజరామరంగా, తానే గంగై, తానే యమునై, తానే సరస్వతి గూడానై, తానే సంగమంగా మారి, తన అస్తిత్వానికి తానే పెక్కు భంగుల్ని కల్పించుకుంటూ వెళ్తూ...

*

విక్రమ్ ఆగిన చోటునుంచీ సంగమానికి దారి చూపెడుతున్నట్టుగా భిక్షగాళ్ల వరుస కనబడుతోంది. అక్కడక్కడా డేరాల కింద బొరుగులు, దేవుళ్ల పటాలు, కాశీదారాలు అమ్మే అంగళ్లు కూడా కనిపిస్తున్నాయి.

గట్టు నుంచీ నీళ్లు ప్రవహిస్తున్న చోటు వరకూ, కిలో మీటరు దూరం యిసుక మేటవేసి వుంది. దూరంగా, నీటిప్రవాహం దగ్గర రకరకాల పందిళ్లూ, జన సంచారమూ కనబడుతోంది. అవతలి గట్టుపైన గుబురుగా పెరిగిన వృక్షాల మధ్యలోంచీ తెల్లటి గుడి శిఖరాలు కనిపిస్తున్నాయి.

విక్రమ్ క్లీనర్ కుర్రాడు గట్టు దగ్గరి నుంచీ యాత్రికుల్ని తూర్పువైపుకు నడిపించసాగాడు. చిత్తడి నేలపైన చెప్పుల ముద్రలు స్పష్టంగా కనపడుతుండగా అందరూ ముందుకు కదిలారు. అస్థిపంజరాలకు పలచటి చర్మం తొడిగినట్టున్న ఆవుదూడల్ని తోలుకుంటూ ఎదురొచ్చాడో వ్యక్తి. అతడి శరీరంలో గూడా ఎముకలు బయటికి పొడుచుకొస్తున్నాయి. జంబు మొక్కల్లా పెరిగిన గడ్డపు వెంట్రుకలు అటూ ఇటూ వొరుగుతుండగా, "గోదాన్ కీజియే బాబూజీ!" అంటూ వెంటపడ్డాడతను.

క్లీనరు కుర్రాడు, "లక్ష్మీనారాయణశాస్త్రి జీ కా ఆద్మీ!" అన్నాడు జవాబుగా.

"కోయీ బాత్‌నహీ! దాన్ కర్‌నే మే క్యా బురా హై! దాన్ కీజియే! ఆప్‌కే పురోకోం కో పుణ్య్ మిలేగా," అన్నాడతను.

సంజీవి అతడివైపుకు అనుమానంగా చూశాడు. అతడి చూపులతో చూపు కలుపుతూ, "సిర్ఫ్ హజార్ రూపాకో ఖరీద్‌లో! దాన్ ముజేహీ దీజియే! ఆప్‌కో తో పుణ్య్ మిలేగా," అంటూ వివరించాడతను.

"మీ శాస్త్రి వ్యాపారం కంటే లాభసాటి పని ఇది. ఆవు ఆ మనిషిదే! మనకు అమ్ముతాడు. మళ్లా ఆయనే దానం తీసుకుంటాడు. సాయంత్రానికి ఎంతమందికి వీలైతే అంతమందికి అమ్మచ్చు. దానమూ తీసుకోవచ్చు," వేళాకోళంగా నవ్వుతూ అన్నాడు జానీ.

"నైతో పాంచ్‌సౌ దేకర్ ఖరీద్‌లో!" ఆవు యజమాని బేరంలోకి దిగాడు.

సంజీవి మౌనంగా ముందుకు నడవసాగాడు.

ఆవు దూడా వెంటరాగా ఆగంతకుడు కూడా వెనకే కదిలాడు.

"తీన్ సౌ..."

సంజీవి అతడివైపుకు తిరిగైనా చూడలేదు.

"దో సౌ... ఏక్ సౌ... పచ్చీస్..."

".... .... ...."

"ఆప్ కే పురకే జరూర్ నరక్ మే జాయేంగా! వైతరిణీ పార్‌కర్‌నే సమయ్ హర్ కిసీకో గాయ్‌కీ పూంఛ్ పకడ్‌కర్ తైర్‌నా పడేగా! ఆప్ నే పురాన్ నహీ పడా? గంగామాయీ కే పాస్ ఆకర్ గోదాన్ నహీ కరేంగే తో వుస్సే బడా దూసరా పాప్ నహీ హై!"

నడకదారి నీళ్ల దగ్గరికి చేరేవరకూ బేరం చేస్తూనే వున్నాడతను. విక్రమ్ క్లీనరు అక్కడ ఆగిన పడవవాళ్లతో భేటీ వేస్తున్నాడు. కాస్సేపటి తర్వాత, "సంగమ్‌కో ఆనే జానే కో హర్ ఆద్మీకో తీస్ రూపా పడేగా! నావ్ వాలేకో పహ్‌లేహీ పైసా దేనా హోగా!" అంటూ ప్రకటించాడు.

తమ టికెట్టు డబ్బుల్ని పడవవాడికి సమర్పించుకున్నాక జానీతోబాటూ సంజీవి కూడా పడవెక్కాడు. గోదానాల స్వీకర్త పశువుల్ని వెనక్కు మరల్చుకుని, యాత్రికుల్ని తిట్టుకుంటూ, మరో గుంపు దగ్గరకి వెళ్లిపోయాడు.

ఒడ్డుకు కట్టిన మోకును విప్పేశాక, పడవ ముందుకు కదిలింది. దూరంగా రెండు నదులూ కలుస్తున్నచోట ప్రవాహం ఉధృతంగా సాగుతోంది. అక్కడక్కడా పడవలు కనబడు తున్నాయి. రకరకాల సంచీలను పదిలంగా పట్టుకుని కూచున్న యాత్రికులు నది నీళ్లకేసి విభ్రమతో చూడసాగారు. నిశ్శబ్దం బరువుతో పడవ సైతం నీళ్లలోకి ఎక్కువగా మునిగినట్టు కనబడుతోంది. తీరం వెంబడే అరగంటసేపు నత్తనడకగా ప్రయాణం చేశాక పడవ సంగమ స్థలాన్ని చేరింది.

పడవవాడు పందిళ్లకేసి చేయి చాపుతూ, "వహా జావ్!" అంటూ ఆజ్ఞాపించాడు. యాత్రికులందరూ పడవ దిగారు.

సంజీవి ఓసారి వెనుదిరిగి చూశాక, "ఇక్కడికి ఇసుక పైన్నుంచీ నేరుగా నడిచే రావచ్చుగదా. సంగమమంటే నదిని దాటాలని అనుకున్నాం మనం. ఈ పడవవాడు అనవసరంగా మనల్ని పడవెక్కించినాడు," అన్నాడు.

"నువ్వు నడిచి వచ్చేట్టయితే పడవవాడెట్ల బతకాల?" అన్నాడు జానీ కిసుక్కుమని నవ్వుతూ.

సంగమం తీరం వెంబడీ వెదురుకర్రలతో రకరకాల పందిళ్లు వేశారు. పైన కొబ్బరి ఆకులూ, తార్‌బాల్ పట్టలూ పరిచారు. పందిళ్లకింద అక్కడక్కడా చెక్క బెంచీలున్నాయి. కొన్ని బెంచీలపైన యేవేవో దేవుళ్ల ఫోటోలు, రకరకాల పూజ సామగ్రీ వున్నాయి. కొన్ని పందిళ్లు జనాలతో కిటకిటలాడుతున్నాయి. మరికొన్ని పందిళ్లు ఖాళీగా బోసిపోతున్నాయి. తీరం దగ్గర స్నానాలు చేసేవాళ్ల సంరంభం మిన్ను ముట్టుతోంది.

ఓ పందిరి కింద వెదురుబుట్టలో ఏదో సర్దుకుంటూ గొడుగు పహిల్వాను కనిపించాడు సంజీవికి. అదే పందిరి కింద కూర్చున్న యాత్రికుల దగ్గరికెళ్లి

''లక్ష్మీనారాయణశాస్త్రిగారు ఇంకా రాలేదా?'' అని ప్రశ్నించాడు సంజీవి.

''ఆయన ఇక్కడికి రారట! మనల్ని ఇక్కడికి రవాణా చేయడం వరకే ఆయనగారి పని. ఇక్కడి తతంగమంతా ఇంకో పురోహితుడు చేస్తాడు. మేమంతా ఆయనకోసమే ఎదురుచూస్తున్నాం,'' అన్నాడో వ్యక్తి.

''ఆరేడు నెలలుగా ఈ వూళ్లోనే వుండావు. ఈ మాత్రం సమాచారమైనా తెలుసుకోకుండా ఏం చేస్తా వుండావు?' అని విసుక్కుంటూ ఓ బెంచీపైన కూర్చు న్నాడు సంజీవి.

''ఈ వూర్లో ఈ మాదిరి లోకమొకటుందని ఇప్పటిదాకా నాకు తెలియనే తెలియదు,'' అంటూ నవ్వేశాడు జానీ. ''మా ఆఫీసు ఆనందభవన్‌కు కిలో మీటరు దూరంలో వుంది. అక్కడికి దగ్గర్నే క్వార్టర్సు. రోజుకు పన్నెండు గంటలు పనిచేసినా టైం సరిపోవడం లేదు. కొత్తగా రిక్రూటయ్యే జవాన్లందరికీ సైకలాజికల్ టెస్ట్‌లు చెయ్యాల. వాళ్లకు హిందీ తప్ప ఇంకో భాష రాదు. నాకొచ్చే హిందీ అంతంతమాత్రమే! సైకాలజీ పుస్తకాలూ, డిక్షనరీ పక్కపక్కన పెట్టుకొని కాలం తోస్తా వుండాను. డిఫెన్సు సర్వీసులో వుద్యోగమంటే మన ఊర్లో అందరూ నాపక్క అసోద్యంగా చూసినారు. కానీ ఇంత దూరంలో, ఒంటిబసివిగా బతికేది సులువేమీ కాదు. మా అమ్మ మాటిని పెండ్లి చేసుకున్నా బాగుండు. నోటికి హితవుగా తిండైనా దొరికితింది...'' కాస్సేపాగాక మళ్లీ అన్నాడు.

''మీ శాస్త్రయినా, నేనయినా ఇంత దూరం వచ్చింది కడుపాత్రానికే గదా!''

''అన్నిట్నీ దుడ్డుతోనే కొలవలేం! నీ పనికీ ఆయన పనికీ తేడానే లేదా?'' అంటూ కసురుకున్నాడు సంజీవి.

''తేడా ఎందుకు లేదు? నాదేమో చిన్న ఉద్యోగం. ఆయనది టాక్స్ గూడా కట్టాల్సిన పనిలేని లాభసాటి వ్యాపారం!'' అంటూ నవ్వేశాడు జానీ.

''దేవుడికంటే సులభంగా దొరికే వస్తువేముంది ఈ దేశంలో! ఈ అలహాబాదులో గూడా వీధివీధికీ ఒక మసీదుందంట. నేనెప్పుడూ ఆ పక్కకే పోలేదు''.

చేవజారిన రోజ్‌వుడ్ కొయ్యతో తయారుచేసిన శిల్పంలా నిగనిగలాడుతున్న నడివయసు పురోహితు డొకడు పందిరిలోకి వచ్చీరాగానే, ''అస్థివాలాలంతా ఇలా వచ్చి కూర్చోండి,'' అంటూ ప్రకటించాడు.

''ఇక్కడ అస్థివాలాలు కానివాళ్లెవరు? అందరి శరీరాల్లోనూ వున్నవి ఎముకలే గదా!'' అన్నాడు జానీ ముఖం చిట్లించుకుంటూ.

''అస్థివాలా అంటే అస్థికలు నిమజ్జనం చేసే వ్యక్తి అని అర్థం,'' అన్నాడు పక్కనే కూర్చున్న వ్యక్తి.

''అందరూ చొక్కాలు విప్పేసి ధోవతులు కట్టు కోవాలి,'' అంటూ రెండో సూచనను ప్రసారం చేశాడు పురోహితుడు.

విప్పిన బట్టల్ని జానీకప్పగించి అస్థికల పాత్రను జిప్‌బాగ్‌లోంచి బయటికి తీసుకొని మిగిలిన అస్థివాలా లతోపాటు పురోహితుడి ముందు కూర్చున్నాడు సంజీవి.

గొడుగు పహిల్వాను అస్థివాలాల ముందు మర్రి ఆకుల విస్తరాకుల్ని పరచి వాటిపైన క్రతువు కవసరమైన వస్తువులన్నీ అమర్చసాగాడు. విస్తరాకుపైన అస్థికల పాత్రల నుంచుకుని వాళ్లందరూ పురోహితుడి సూచన లను పాటించసాగారు.

తెలుపూ నలుపూ కలగలిసిన పురోహితుడి బవిరి గడ్డమూ, పిలకజుట్టూ ఈదురు గాలికి రెపరెపలాడు తున్నాయి. నిత్య గుట్కా సేవనంతో నల్లగా గారపట్టిన అతడి పలువరుస అవ్యక్తమైన అతడి జీవన యాతనకు ప్రతీకలా వెలవెలబోతోంది. శరీరంలోని మిగిలిన ఇతర భాగాల కంటే ఎక్కువగా పనిచేయడంవల్ల అతడి నోరూ, పెదవులూ బలంగా దృఢంగా కనిపిస్తున్నాయి.

ముందుగా పురోహితుడు తన ముందు కూర్చున్న దాదాపు యాభైమంది అస్థివాలాల పేర్లూ, నిమజ్జనం చేయబడుతున్న అస్థికల తాలూకు వ్యక్తుల పేర్లూ, వాళ్ల సంబంధాలూ, గోత్రాలూ తెలుసుకున్నాడు. రకరకాల మంత్రాలు వల్లిస్తూ ప్రతి వ్యక్తి దగ్గరా ఆగి, వాళ్ల వివరాలన్నింటినీ అలవోకగా వల్లించేశాడు. అతడి జ్ఞాపకశక్తికి వాళ్లు విస్తుపోయి చూస్తుండగా, ''రోజుకు వందలమంది చేత శ్రాద్ధకర్మలు చేయిస్తాను. ఇంత వరకూ ఎవరి పేర్లుగానీ గోత్రాలు గానీ తప్పుగా రిపీట్ చెయ్యలేదు. అసలైన అవధానమంటే ఇదే,'' అంటూ పరవశంగా నవ్వేశాడు.

అతడి స్వరం మెగాఫోన్లకంటే బిగ్గరగా పలుకు తోంది. దూరంగా మిగిలిన పందిళ్ల నుంచీ వినిపిస్తున్న మంత్రధ్వనులూ, నదిలో మునుగుతున్న మనుషుల కేకలూ, నది నీటి హోరూ అతడికి నేపథ్య సంగీతాన్ని సమకూరుస్తున్నాయి. భార్యల్ని పోగొట్టుకున్న యువ కులూ, తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్న ముసలివాళ్లూ, కన్న బిడ్డల్ని పోగొట్టుకున్న నడివయసువాళ్లూ, తోడబుట్టిన వాళ్లని పోగొట్టుకున్న వ్యక్తులూ.... ఎటు చూసినా రక రకాల వ్యధలు. తన తల్లి స్మృతులు బలంగా కమ్ముకోవ డంతో విచలితుడైపోయిన సంజీవి గుడ్లనీళ్లు కుక్కు కుంటూ కూర్చున్నాడు.

పురోహితుడు వాళ్లందరిచేతా గోధుమపిండితో పిండాలు తయారుచేయించి వాటికి రకరకాల నైవేద్యాలు సమర్పింపచేశాడు. చిన్న అరటిపండు తోలు వలిపించి "మీవాళ్లకు మీరు ఇస్తున్న చివరి ఆహారమిదే! తృప్తిగా సమర్పించండి," అంటూ హెచ్చరించారు. చివరగా అస్థికల్నీ, పిండాల్నీ నీళ్లల్లో వదలిపెట్టి, స్నానం చేసి రమ్మన్నాడు.

అస్థికల కుండ చేతబట్టుకుని బుగ్గలపైన కన్నీరు చారలు గట్టుతుండగా నది దగ్గరికి నడవసాగాడు సంజీవి. జానీ అతడి దగ్గరికొచ్చి నడుస్తూ, "మనకూ ఈ అస్థికలకూ పెద్ద తేడా లేదు. అవి నేరుగా నీళ్లల్లో కలిసిపోతాయి. మనకూ, మన ఎముకలకూ మధ్య చర్మం అడ్డంగా వుంది. లేకపోతే మన శరీరాలు కూడా నిమజ్జనమయిపోయినట్టే లెక్క," అన్నాడు నిర్వికారంగా ముఖం పెట్టుకుంటూ.

సంజీవి ముభావంగా నీళ్లలోకి దిగాడు.

గట్టు దగ్గర పదిపన్నెండేళ్ల కుర్రాళ్ల రొద ఎక్కువగా వుంది.

రెండుమూడు బారలకవతల నీళ్లల్లో ఆగిన పడవల పైనుంచీ కొందరు పిల్లలు నీళ్లల్లోకి ఎగిరెగిరి దూకుతున్నారు. నిమజ్జనం చేసిన రకరకాల వస్తువులు ప్రవాహంపైన నదికి అంచులా తెట్టుగట్టుకు పోయి వున్నాయి.

సంజీవి మరో అడుగు ముందుకేశాడు.

పది పన్నెండుమంది కుర్రాళ్లు అతడివైపుకు ఒక్కుమ్మడిగా ఈదుకొచ్చారు.

సంజీవి మరికొంత ముందుకు కదిలాడు. ప్రవాహం వేగంగా అతడి నడుముదాకా తడుపుతోంది. చివరిసారిగా తల్లి ఆత్మీయ స్పర్శను అనుభవిస్తున్నట్టుగా అస్థికల పాత్రను గుండెల కత్తుకున్నాడు. కుర్రాళ్లు అతడి చుట్టూ కోటలా ఒకరి చేతులు ఇంకొకరు కూర్చుకొని నిల్చున్నారు.

"త్వరగా కానీ! నీతో వచ్చినవాళ్లంతా వెనక్కు మళ్లేశారు," అంటూ అరిచాడు జానీ.

పెద్దగా నిట్టూరుస్తూ అస్థికల కుండను నీటిలోకి ముంచాడు సంజీవి. నీటిలోపల అతడి చేతుల్లోంచి ఎవరో కుండను లాక్కున్నారు. దిగ్గున వులిక్కిపడ్డాడు సంజీవి.

నీటిలోపల చేపపిల్లలా ఓ ఆకారం ముందుకు కదిలిపోయింది. నాలుగైదు బారలు వెళ్లాక ఆ ఆకారం నీళ్లపైకి లేచింది. పది పన్నెండేళ్ల కుర్రాడొకడు అస్థికల పాత్రలో చేయి పెట్టి దేనికోసమో వెదుకుతున్నాడు. నలుగురైదుగురు పిల్లలు తమ చేతుల్ని కూడా కుండలోకి బలవంతంగా జొనుపుతున్నారు. ఫెళ్లుమంటూ కుండ పగిలిపోయింది. అందులోని ఎముకలూ, బూడిదా నీళ్లలోకి పడిపోయాయి.

గట్టు పై నుంచీ జానీ మరి రెండుసార్లు కేకేశాక గానీ సంజీవి నీళ్లలో తల ముంచలేదు. తల నీటిలోపలికెళ్లగానే అసంఖ్యాకమైన మానవ శరీరాలు ఒక్కసారిగా తనను స్పృశించినట్టు తోచడంతో సంజీవి నిలువునా వణికిపోయాడు. పూనకం పట్టినవాడిలా వూగిపోతూ ఒడ్డుపైకి విసురుకొచ్చాడు.

"అస్థికలతోబాటు కొందరు బంగారమూ, చిల్లర నాణాలూ నిమజ్జనం చేస్తారంట! దానికోసమే వాళ్ల దేవులాట! అది వాళ్ల బతుకుతెరువు," అన్నాడు జానీ అడగని ప్రశ్నకు సమాధానం చెబుతున్నట్టుగా.

మొద్దుబారిన బుర్రతో, స్తబ్దమైన శరీరాన్ని పందిరి దాకా లాక్కొచ్చాడు సంజీవి. "గుండు గీయించుకోండి! లేకపోతే తలపైన మూడు గాట్లయినా పెట్టించుకోండి. అది శాస్త్రం," అంటూ ఎదురొచ్చాడు పురోహితుడు. అతడి వెనకే కత్తి చేతబట్టుకుని మంగలివాడూ వస్తున్నాడు.

సంజీవి నిమిత్తమాత్రుడిగా మంగలివాడి ముందు కూర్చున్నాడు. అతను సంజీవి తలపైన మూడు చోట్ల కత్తితో బరికి, గుప్పెడు వెంట్రుకల్ని తీసి కిందికి పారేశాడు. ఆ తరువాత, "పచ్చీస్ దేవ్," అన్నాడు ముక్తసరిగా.

"పచ్చీస్ నై... దస్ లేవ్!" అంటూ దబాయించాడు జానీ.

"ఇదర్ రేట్ పచ్చీస్. ఫిక్స్‌డ్," అన్నాడు మంగలి.

జానీ సంజీవి చొక్కాలోంచి డబ్బుతీసి లెక్కబెట్టి మంగలికిచ్చేశాడు.

"మళ్లీ స్నానం చేయాలి," అన్నాడు పురోహితుడు.

సంజీవికీసారి గంగను చూస్తే భయమేసింది.

తక్కుతూ తారుతూ నీళ్లలోకి దిగి కళ్లు మూసుకుని ఆదుర్దాగా మూడు మునకలు మునిగేశాడు. అతనీసారి పందిరి దగ్గరికి తిరిగొచ్చేసరికి పురోహితుడి కంఠస్వరంలో మార్పు స్పష్టంగా ధ్వనిస్తోంది. "మీ పెద్దలకు శ్రాద్ధకర్మలు సక్రమంగా జరిగినందుకు బ్రాహ్మణులకు సంతర్పణ చేయండి. మీశక్తికెంత వీలైతే అంత చేయొచ్చు. బలవంతంలేదు. అయితే మీరు పెట్టిన ఖర్చంతా మీ పెద్దలను పుణ్యలోకాలకు చేరుస్తుందని మరచిపోవద్దు. ఈ వూళ్లో నాసిరకం భోజనం చేయాలన్నా మనిషికి పాతిక రూపాయలు ఖర్చవుతుంది.

పదహారుమందికో, పన్నెండు మందికో, తొమ్మిది మందికో, ముగ్గురికో, కనీస సంతర్పణ చేయండి. ఎంత మందికి చేయదలుచుకున్నారో అన్ని పాతికలు నా చేతి కివ్వండి. మీచేత ఈ కర్మ చేయించటంకోసం మనదేశా న్నొదిలి, పొట్ట చేతబట్టుకుని ఇంతదూరం వచ్చాను. శాస్త్రిగారి కిచ్చిన దక్షిణతో నాకేం సంబంధంలేదు. నాకివ్వదలచుకున్నదేదో తాంబూలంలో పెట్టి ఇవ్వండి. నా పాదాలకు నమస్కారం చేసుకోండి. ఆశీర్వదిస్తాను."

దూరంగా ఒడ్డు దగ్గర కలకలం ప్రారంభమైంది. పిల్లలందరూ ప్రవాహం నుంచీ దూరంగా పరుగులు తీస్తున్నారు.

"ఊపర్ సే ప్రవాహ్ ఆతీహై," అంటూ వో కీచు గొంతుక పెద్దగా అరుస్తోంది.

"ఇది వర్షాకాలం గదా! రోజూ ఇదో గొడవ. పైన్నుంచీ వెల్లువ ముంచుకొస్తోందని రోజూ భయ పడ్డమే! కృష్ణానదితో ఆడుకుంటూ పెరిగిన శరీరం నాది. వరదలెప్పుడు ముంచుకొస్తాయో నాకు తెలియనిది గాదు. మీరు కంగారు పడకుండా దక్షిణ సమర్పిం చండి" అంటున్నాడు పురోహితుడు.

పురోహితుడికి దక్షిణ ఇచ్చుకున్నాక జానీ దగ్గరి నుంచి తన దుస్తుల్ని తీసి తొడుక్కున్నాడు సంజీవి.

మరోసారి ప్రవాహం దగ్గర గగ్గోలు చెలరేగింది. పైకొచ్చిపడిన నీటి వురవడికి తట్టుకోలేక పెద్ద పంది రొకటి పటపటా విరిగి ప్రవాహంలో పడి కొట్టుకుపోసా గింది. పెద్దగా అరుస్తూ జనం పరుగులు మొదలు పెట్టారు. ఇంతలో మరో పందిరి కూలింది. కార్చిచ్చు వ్యాపించినంత వేగంగా ప్రవాహం ముంచుకొస్తోంది. పురోహితుడు సైతం పంచ పైకెగగట్టుకుని పరుగులు తీస్తున్నాడు.

"పద... పద.... పరిగెట్టు," అంటూ దౌడు తీశాడు సంజీవి. అప్పటికే జానీ పరుగందుకునేశాడు. తమ పరి వారాన్నీ, వస్తువులనూ సర్వస్వమూ మరచిపోయి జన మంతా గుండెలరచేతపట్టుకుని గట్టుకేసి పరిగెడు తున్నారు. వెనక నుంచీ ప్రవాహం చావులా తరుము కొస్తోంది. చూస్తూండగానే సంజీవి కాళ్ల కిందికి నీళ్లు ముంచుకొచ్చేశాయి. పాదాలు తడిసిపోయాయి. మరి కొన్ని క్షణాల్లోనే అతడి మోకాళ్లు కూడా నీటిలో మునిగి పోయాయి.

"బాబూజీ! ఇదరాయియే," అన్న కేక వినిపిం చింది. కొయ్య పడవ పై నుంచి నావ్‌వాలా కేకేస్తున్నాడు. చప్పున అటు తిరిగి పడవలో కెగిరి దూకేశాడు సంజీవి. ఆ వెనుకే జానీ గూడా పడవలోకి గెంతడం కనిపించిం దతడికి.

నీటి వాలుపైన పడవ వేగంగా కదులుతోంది. దూరంగా తీరం కనబడుతోంది. కొంతమంది మనుషులు ఇంకా తీరం దగ్గర పరిగెడుతున్నారు. ఇంకొందరు పడవల్లోకి చేరుకున్నారు. రెండునదులూ కలిసినచోట పాత గుడొకటి నీటిలో మునిగిపోతోంది. రెండు నదుల్లోనూ వర్షం నీళ్లు పొంగుకొస్తున్నాయి. ఇప్పుడు ఏది గంగో, ఏది యమునో తెలియడం లేదు. సంగమం తీరంకేసి వెనక్కు నడుస్తున్నట్టుగా కనిపి స్తోంది. జనాల గోడు నది హోరులో విన్పించడం లేదు.

కాస్సేపు పడవలో స్తబ్దంగా కూలబడిపోయాడు సంజీవి.

పడవ చివర్లో శిల్పంలా నిలబడిపోయిన జానీ కళ్లార్పకుండా నదీ ప్రవాహం కేసి చూస్తున్నాడు.

వరద ఉధృతిలో పడవ గింగిరాలు తిరుగుతూ కొట్టుకుపోతోంది. నీళ్లు పడవ అంచుల దాకా ఎగసి పడుతున్నాయి. పడవవాడు శక్తికొద్దీ తెడ్డేస్తూ పడవను అదుపులోకి తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

"జోర్‌సే తెడ్డూ దాలో! ఇదరీచ్ దాలో! తుమ్ వుదర్ కిస్‌కో దాల్‌తాహై," అంటూ వచ్చీరాని హిందీలో పడవవాణ్ణి కసురుకున్నాడు సంజీవి.

"ప్రవాహ్‌కే కిలాఫ్ డాండ్ చల్‌నేసే నావ్ పలట్ జాయేగా," అని అరిచాడు పడవవాడు.

చూస్తూ వుండగానే పడవ సంగమం నుంచీ దూరంగా కొట్టుకొచ్చేసింది. సంజీవికి ఏడుపు ముంచు కొస్తోంది. వెక్కిళ్లు తన్నుకొచ్చాయి. కాలం నడవడం మానేసినట్టుగా అనిపించడంతో అలా తామెంతసేపు నీటివాలులో కొట్టుకుపోయారో గమనించే స్థితిలో లేడు సంజీవి.

భీకరమైన మృగపుకోరల్లా నీళ్లు పడవలోకి దూసు కొస్తున్నాయి. ఇదే తనకు ఆఖరు గడియేమోననీ, తానిక సురక్షితంగా ఇంటికి తిరిగెళ్లే అవకాశం లేదేమోననీ సంజీవి కనిపించసాగింది. గబగబా జేబులోకి చేయిపెట్టి దొరికిన డబ్బునంతా తీసి పడవవాడి కందిస్తూ, "నీకెంత కావాలంటే అంతా తీసుకో! మమ్మల్నెలాగైనా తీరం చేర్చు," అంటూ బొంగురుపోతున్న గొంతుకతో ప్రాధేయపడ్డాడు.

చెమటలు కారుతున్న ముఖాన్ని పైకెత్తి సంజీవి కేసి చూస్తూ అదోలా నవ్వాడు పడవవాడు. అతడి పెదవులు చిత్రంగా కదిలాయి. అంతలో మళ్లీ ఆ

ప్రయత్నం విరమించుకుని ఓ చేత్తో తెడ్డేస్తూనే మరో చేత్తో డబ్బందుకుని తన జేబులోకి నెట్టేశాడు.

ఈలోగా రివ్వున ఓ నీటితేప పడవను విసిరి కొట్టింది. దారం తెగిన గాలిపటంలా వూగిసలాడుతూ పడవ పక్కకు తిరిగి తీరంకేసి దూసుకెళ్లింది. వేగంగా గట్టును ఢీకొట్టబోతోంది. "కూదో సాబ్," అన్న కేకతో బాటూ పడవవాడు గట్టుపైకి దూకేశాడు. ఎవరో వెనక నెట్టుతున్నట్టుగా సంజీవి సైతం ఎగిరి గట్టుపైకి దూకాడు. ఆ తరువాత స్ప్రింగులా పైకిలేచి నది నుంచీ దూరంగా పరిగెత్తసాగాడు. దాదాపు పదినిముషాలలా పరిగెత్తిన తర్వాత కనిపించిన పెద్ద రాతి పైకెక్కి నిల్చుని, రొప్పుతూ వెనక్కు తిరిగి చూశాడు. దూరంగా పరిగెత్తు కొస్తున్న జానీ కనిపించాడు. పడవవాడు మాత్రం తాపీగా నడిచి వస్తున్నాడు.

గసతో ఎదరొమ్ము ఎగసి పడుతుండగా రాతి గుండు పైన అలాగే కూర్చున్నాడు సంజీవి. ముఖం పైన ధారలు కట్టిన చెమట వుప్పగా పెదవుల్ని తాకు తోంది. ఇంతలో జానీ గూడా వచ్చి అతడి పక్కన కూర్చు న్నాడు. అలసటతో అతడు గూడా బుసలు గొడు తున్నాడు. హోరుమంటూ ఈదురుగాలి శివాలెత్తి నట్టుగా వూగుతున్నాయి. మిత్రులిద్దరికీ ఒకరి గుండెల సవ్వడి మరొకరికి వినబడుతోంది. పడవవాడు దూరం గా వున్న మరో రాతిపైకెక్కి కూర్చుని సేదతీరసాగాడు.

"అంతా భ్రమ, మూర్ఖత్వం," అంటూ గొణిగాడు సంజీవి. జానీ అతడికేసి ముఖమైనా తిప్పి చూడలేదు. "చిన్నప్పటి నుంచీ నన్నెంత నీతిగా, నియమంగా పెంచింది మా అమ్మ! ఎంత దీక్షామెది! ఎంత భక్తితో, నిష్టతో ఆమె అస్థికల్ని నిమజ్జనం చేసినాను! ఆమె అస్థికల్ని తనలోకలుపుకున్నాక గంగ కూడా అమ్మే అయి పోలేదా," చెబుతూనే నిట్టూర్చాడు సంజీవి. "అంతా పిచ్చిలెక్క! వర్షం కురిస్తే గంగ పారుతుంది. గంగంటే నీళ్లు. చచ్చిపోయినాక అమ్మ బతుకు ఆఖరయిపో యింది. అస్థికలంటే కేవలం కాల్షియం. అంతే! బతికి నంతకాలమే బతుకు. ఆత్మ, పుణ్యం, పై లోకాలు, మతం అన్నీ ట్రాష్... అవన్నీ అబద్ధాలు గాకపోతే ఇంత నిష్టతో శ్రాద్ధకర్మలు చేసిన నా దగ్గరికి చావింత దగ్గరిగా ఎట్లొస్తింది? ఇవన్నీ పనికిరాని మాయమాటలు... ఈ బతుకులో అవేవీ ఉపయోగానికి రావు. జానీ వింటా వుండావా లేదా?"

జానీ వులిక్కిపడి వింటున్నట్టుగా తల వూపాడు.

"అంతవరకూ ప్రవాహానికడ్డంగా తెడ్డేసిన మనిషిని దోవ మర్లించిన శక్తి పేరేమి? దేన్ని చూసి వాడు మారినాడు? అసలు ముందుగా దేనికోసం మనల్ని ప్రమాదంలోకి లాక్కోనిపోయినాడు? మన బతుకు ల్నంతా నడిపిస్తావుండే పవరు ఏది? చావు కొంగుదాకా పోయినప్పుడుగానీ నాకు నిజం తెలియలేదు. గంగలో మునిగినప్పుడు దేన్నయినా వదిలిపెట్టి పోవాలంటారు. నేను గంగలో వదులుకునింది ఏందో ఇప్పుడు అర్థమ వతా వుంది నాకు," అన్నాడు సంజీవి.

"నిజమే సంజీవీ! చావు అంచుదాకా పోయిన ప్పుడుగానీ నాకుగూడా నిజం తెలిసిరాలేదు," అన్నాడు జానీ కాస్సేపాగి సాలోచనగా. "వరదనీళ్లల్లో వోటి పడవ లో కొట్టుకొనిపోతా వుండేటప్పుడుగానీ మనిషెంత బల హీనుడో తెలియలేదు నాకు. డబ్బుంటే లోకాన్నంతా గెలిసేయచ్చుననుకున్నాను. నీళ్ల మధ్య ఒంటిగా చిక్కు కోని పోయినప్పుడు భయంతో హడలెత్తిపోయినాను. నీళ్ల జోరు చూడలేకుండా కండ్లు మూసుకున్నాను. ఈ లోపల నా బుర్రలో ఏదో మాయ జరిగిపోయింది. చిన్న ప్పుడెప్పుడో మసీదులో నేర్చుకున్న సూరాలు జ్ఞాపకం వచ్చినాయి. ఎంతసేపట్ల సూరాలు జపిస్తా వుండిపోయి నానో తెలియదు. కండ్లు తెరిచి చూసినాను గదా! పడవ వాడు తెడ్డు వొదిలిపెట్టేసి పక్కకు జరగతా కనబడినాడు. సరిగ్గా అప్పుడే పెద్ద అల పడవను ఈడ్చికొట్టింది. చెప్తే నువ్వు నమ్మతావో, నమ్మవో! కానీ ప్రమాణ పూర్తిగా నేను చెప్పేది మాత్రం నిజం. ఆ అల యేమాదిరి ఎగిరిందనుకున్నావు? మా ఇంట్లో గోడపైన నాగూరు దర్గా ఫోటో చూసినావుగదా నువ్వు! అచ్చం అదే ఆకారం. వెంటనే దర్గాకొచ్చి పాతాలు ఇస్తానని మొక్కు కునేసినాను. ఆశ్చర్యం పడవ గట్టు దగ్గిరికి ఇసరకొచ్చే సింది..." జానీ చెప్పుకుపోతూనే వున్నాడు.

సంజీవి అతడికేసి వింతగా చూస్తూనే వున్నాడు.

హిమాలయాల్లో కరిగిన మంచునీ, మేఘాల్లోంచీ కురిసిన వాననీ ఒకేలా తనలో కలుపుకుని వేలాది సంవత్సరాలుగా కోట్లాది మంది జీవుల అస్థికల్ని తనలో నిమజ్జనం చేసుకుని ఒడ్డున జరుగుతున్న పరిణామా లకు తానేమీ కారణం కాదన్నట్టుగా రొద చేస్తూ నిర్లక్ష్యం గా, నిష్పూచీగా గంగానది ప్రవహిస్తూనే వుంది.

*తానా తెలుగు వెలుగు, 2001*
*విపుల మాసపత్రిక, ఆగస్ట్ 2001*